ప్రజాశక్తి

శుక్రవారం 12 మే 2023

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

ప్రారంభోత్సవాల హడావుడి

◆ విశాఖలో బిజీబిజీగా గడిపిన సిఎం జగన్
◆ వైఎస్ఆర్ విగ్రహం, అపోలో కేన్సర్ సెంటర్, సీ హారియర్ మ్యూజియం, ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం ప్రారంభం ◆ క్రీడాకారులతో మాటామంతీ



క్రీడాకారిణి అంజలి శర్వాణికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న సిఎం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

విశాఖలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగింది. వరుస ప్రారంభోత్సవాలతో సందడిగా ముగిసింది. ఆయన మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. తొలుత పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియం ముందు ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులతో సమావేశమయ్యారు. అందరినీ ఆత్మీయంగా పలకరించారు. క్రీడాకారిణి కె.అంజలి శర్వాణికి రూ.10 లక్షల నగదు బహుమతి అందజేశారు. ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని వెల్లడించారు. ఆ తర్వాత ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలోలో నూతనంగా నిర్మించిన కేన్సర్ యూనిట్‌ను ప్రారంభించారు. వైద్యాధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం విశాఖపట్నం పర్యాటక అభివృద్ధిలో భాగంగా పది కోట్ల రూపాయల వ్యయంతో విఎంఆర్‌డిఎ ఆర్‌కె.బీచ్ వద్ద నిర్మించిన సీ హారియర్ టూరిజం ప్రాజెక్టును ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన యుద్ధ విమానం, ఇతర ప్రదర్శన అంశాలను పరిశీలించారు. విమానం, నమూనాల గురించిన విశేషాలను నౌకాదళ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆ తరువాత ఎంవిపి.కాలనీలో మిగతా 2లో..

అరెస్టుల పర్వం

500 మంది క్లాప్ డ్రైవర్లు, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్లపై ప్రభుత్వ నిర్బంధం
- ఖండించిన సిఐటియు



వెంకటరెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వారం రోజులుగా జీవో 7 ప్రకారం రూ.18500 జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ క్లాప్ డ్రైవర్లు, జివిఎంసి కాంట్రాక్టు మిగతా 2లో..

సేవలకిచ్చే గౌరవం ఇదేనా..!

◆ 104, 108 సిబ్బందికి జీతం బకాయి ◆ అప్పులతో సాగిస్తున్న జీవనం



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కింద పిహెచ్‌సి వైద్యునితో కలిసి గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందిస్తున్న 104, అత్యవసర సేవలు అందించి ప్రాణాలు కాపాడుతున్న 108 వాహన సిబ్బందికి ప్రభుత్వం రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదు. మే ఒకటి నాటికి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ జీతాల బకాయి వుండగా, రెండ్రోజుల క్రితం ఈ వాహనాల నిర్వహణ బాధ్యతను చూస్తున్న అరబిందో ఫిబ్రవరి జీతం చెల్లించింది. రోజుకు 12 గంటలపాటు విధులు నిర్వహించి, రోగులు, బాధితులకు వైద్య సేవలందిస్తున్న 104, 108 సిబ్బంది బాధను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం ప్రతినెలా బిల్లులు ఇవ్వకపోవడంతో నెలవారీ జీతాలు చెల్లించలేకపోతున్నట్లు అరబిందో సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు తప్ప, వైద్యసేవల ద్వారా ప్రభుత్వ ప్రతిష్ట పెంచుతున్న సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. గ్రామాల్లో బిపి, సుగర్, ఆస్తమా వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు 104 సిబ్బంది నెలకు సరిపడా మందులు అందజేసేవారు. ప్రస్తుతం ఆ సేవలను ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌గా కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం మార్చడంతో పిహెచ్‌సి వైద్యునితో కలిసి వీరు గ్రామాలు వెళ్లి వైద్యసేవలందిస్తున్నారు.

ఇంటి దగ్గర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రులకు తీసుకొచ్చి మిగతా 2లో..

ప్రతినెలా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి



వైద్య, ఆరోగ్య శాఖలో అత్యంత కీలకమైన సేవలందిస్తున్న 104, 108 సిబ్బందికి ప్రతినెలా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి. అతి తక్కువ వేతనాలతో పనిచేయించుకుంటూ జీతాలు సకాలంలో ఇవ్వకపోవడం అన్యాయం. ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం, చట్టపరమైన సదుపాయాలు వర్తింపజేయాలి.

వివి శ్రీనివాసరావు,
కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జెఎసి జిల్లా చైర్మన్

గంజాయి నిర్మూలనలో విఫలం : టిడిపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నాలుగేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గంజాయి నిర్మూలనలో పూర్తిగా విఫలమైందని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల తర్వాత ఉత్తరాంధ్ర పోలీసు అధికారులు గంజాయి నివారణపై సమావేశం జరపడం గమనార్హమన్నారు. ఈ గంజాయి అంతా ఒడిశా నుంచి రవాణా జరుగుతోందని నెపం నెట్టేస్తున్నారని, అసలు ఈ గంజాయి ఎవరు పండిస్తున్నారో, అమ్ముతున్నారో మిగతా 2లో..

పోర్టుకు సాగర్ శ్రేష్ఠ సమ్మాన్ పురస్కారం

▶ వార్త 2లో..

143 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

▶ వార్త 7లో..

మొదటి పేజీ తరువాయి..

సేవలకిచ్చే గౌరవం ఇదేనా..!

ప్రాణాలు కాపాడే అత్యవసర సేవలను 108 వాహన సిబ్బంది అందిస్తున్నారు. ఆరోగ్య శ్రీ ట్రస్టు కింద ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 51 వాహనాల్లో 290 మంది ఈ తరహా సేవలందిస్తున్నారు. అలాగే 104 వాహనాలు 79 ఉన్నాయి. వీటిలో 168 మంది పనిచేస్తున్నారు. 108, 104 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది సేవలను గుర్తించి ప్రతినెలా జీతాలను ప్రభుత్వమే చెల్లించాలని వారు కోరుతున్నారు. జీతాలు ప్రతినెలా చెల్లించకపోవడంతో కుటుంబ అవసరాలకు అప్పులుచేయాల్సివస్తోందని వాపోతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 108, 104 వాహనాలు, సిబ్బంది వివరాలు

108 వాహనాలు : 51	సిబ్బంది : 290
104 వాహనాలు : 79	సిబ్బంది : 168

గంజాయి నిర్మూలనలో విఫలం : టిడిపి

అందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు. యువత ఉద్యోగాలు లేక, పరిశ్రమలురాక విలవిల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు వద్ద 840 కిలోల గంజాయి పట్టుకున్నారని, నలుగురిని అదుపులోకి తీసుకోగా వారిని ఏమైనా విచారించారా ? అని ప్రశ్నించారు. కేంద్రంలో నార్కోటిక్ బ్యూరో రిపోర్ట్స గంజాయి రవాణాలో ఎపి నెంబర్ వన్‌గా ఉందని తేల్చిందన్నారు. దేశానికి ఆహార ధాన్యాలు అందించే స్థానం నుంచి గంజాయి అందించే దుస్థితికి రాష్ట్రం వచ్చిందని విమర్శించారు. విశాఖ, చోడవరం, గాజువాక ప్రాంతాలలో గంజాయి కేసుల విచారణకు మూడు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం 2022 జులైలో జీవో ఇచ్చి, నేటికి ఒక్క కోర్టునూ ఏర్పాటు చేయలేదన్నారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతంలోని 11 మండలాలలోని పోలీసు సిబ్బందిని తక్షణం బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వారి సాయంతోనే గంజాయి అక్రమ రవాణా సాగుతోందని ఆరోపించారు.

ప్రారంభోత్సవాల హడావుడి

1.18 ఎకరాల విస్తీర్ణంలో రూ.25.50 కోట్లతో జివిఎంసి నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియాన్ని, రామ్ నగర్‌లో రూ.13.50 కోట్లుతో విఎంఆర్‌డిఎ నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భీమిలి వద్ద రూ.2486.38 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, తూర్పు నావికాదళ అధికారి అడ్మిరల్ బిశ్వజిత్ దాస్ గుప్తా, చీఫ్ విప్ కరణం ధర్మశ్రీ, టిటిడి. ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, జిల్లా కలెక్టరు డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, బి.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్న వానపల్లి చరణ్ సాయి మణికంఠకు సిఎం తన పర్యటనలో భాగంగా భరోసా కల్పించారు. తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను ఆదేశించారు. ఈ క్రమంలో చరణ్ సాయి మణికంఠకు లక్ష రూపాయల చెక్కును ఆరిలోవ వెళ్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కెయస్.విశ్వనాథన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ రూరల్ తహశీల్దార్ సనపల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టుల పర్వం

వర్కర్లు సాగిస్తున్న ఆందోళన గురువారం తీవ్రరూపం దాల్చింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నగరానికి వచ్చిన సందర్భంగా ఆయనకు వినతి పత్రం ఇచ్చేందుకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు గురువారం మధ్యాహ్నం వచ్చిన క్లాప్ డ్రైవర్లను, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్లను టూ టౌన్ పోలీసులు బలవంతంగా వాహనాలు ఎక్కించి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు పి.అనిల్ కుమార్, ఇందుకూరి లక్ష్మీరాజు, ఎం.గణేష్, పామాడ రాజు, చందక శ్రీను, ఇసాక్‌తో సహా వంద మంది ఉన్నారు. వీరందరినీ టూ టౌన్ స్టేషన్‌కు తరలించారు. అలాగే నగర పరిధిలోని గోపాలపట్నం, త్రీ టౌన్, గాజువాక, వన్‌టౌన్ తదితర ప్రాంతాలలో కూడా క్లాప్ డ్రైవర్లను, కాంట్రాక్ట్ వర్కర్లను అరెస్ట్ చేశారు. ఇలా అన్ని చోట్ల కలిపి 500 మందిని అరెస్ట్ చేసి వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ జీవో 7ను అనుసరించి క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జాయింట్ లేబర్ కమిషనర్ కూడా ఈ మేరకు మార్గదర్శకాలు ఇచ్చారని గుర్తుచేశారు. అయినప్పటికీ జివిఎంసిలో అమలు చేయలేదన్నారు. కేవలం రూ.12,500 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారని, ఇది అన్యాయమని అన్నారు. క్లాప్ డ్రైవర్లను ఆప్కాస్‌లో విలీనం చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న తమను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. అరెస్టులతో, బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని, ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులు సరికాదు : సిఐటియు

క్లాప్ డ్రైవర్ల అరెస్టులను సిఐటియు విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. సమస్యలను చెప్పుకుందామనుకున్న నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రిని కలవడానికి అనుమతించాలని రెండు రోజుల నుంచి అధికారులను విన్నవించుకుంటున్నా కలవడానికి అవకాశం కల్పించకపోవడం సరైనది కాదన్నారు.

వైజాగ్ పోర్టుకు సాగర్ శ్రేష్ఠ సమ్మాన్ పురస్కారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మేజర్ పోర్టులలో వివిధ రకాల నిర్వహణ సూచీలలో అసాధారణమైన పనితీరు కనబరిచినందుకు ఏటా ఇచ్చే సాగర్ శ్రేష్ఠ సమ్మాన్ పురస్కారం విశాఖపట్నం పోర్టు అథారిటీకి లభించింది. న్యూఢిల్లీలో జరిగిన హరిత్ సాగర్ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని విశాఖపట్నం పోర్టు ఛైర్మన్ డా మధేయాన్ అంగముత్తు స్వీకరించారు. ఇదే కార్యక్రమంలో జీరో కార్బన్ ఎమిషన్ గోల్ సాధించేందుకు పాటించాల్సిన మార్గదర్శకాలను కేంద్ర మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో పోర్టు సహాయ మంత్రి శ్రీపాద వై నాయక్, షిప్పింగ్ సెక్రటరీ సుధాన్ష్ పంత్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

మహిళ న్యాయపోరాటం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :

వస్త్ర వ్యాపారం కోసం ఒప్పందం చేసుకుని ఇప్పుడు వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఓ మహిళ గురువారం న్యాయపోరాటానికి దిగింది. ఆమె కథనం ప్రకారం.. విజయనగరానికి చెందిన లెంక లీలా భారతి విశాఖ నగరం ఆశీలుమెట్ట వద్ద ఉన్న శ్రీవాణి వస్త్ర దుకాణం యజమాని బలభద్ర వెంకట కుమార్‌తో ఈ ఏడాది మార్చి 23న ఒప్పందం చేసుకుంది. తాను ఫ్యాషన్ డిజైనర్‌గా రూపొందించిన వస్త్రాలు అమ్ముకునేందుకు అనుమతినిస్తూ ఒప్పందం కుదిరింది. అప్పటికే తనకు జిఎస్‌టి అనుమతి లేనందున శ్రీవాణి వస్త్ర దుకాణం కుమార్‌తో వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్నట్లు బాధితురాలు తెలిపారు. ఏప్రిల్ 10న వ్యాపార నిమిత్తం అహ్మదాబాద్, సూరత్ ప్రాంతాలకు వెళ్లగా ఆ సమయంలో కొంత వ్యాపారం జరిగిందని, దీనికి సంబంధించి 40 వేల రూపాయలను ఆయన తనకు బ్యాంకు ద్వారా పంపించారని చెప్పారు. ఒప్పందంలో పేర్కొన్న ప్రకారం 20 శాతం మాత్రమే ఆయన తీసుకోవాలని, కానీ ఒప్పందాన్ని అతిక్రమిస్తూ 32 శాతం తీసుకున్నారని, దీనిని ప్రశ్నించినందుకు తనపై వేధింపులు ప్రారంభించారని ఆమె వాపోయారు. ఒప్పందం చెల్లదని, ఇక్కడ తన వ్యాపారం చేయడానికి అనుమతి లేదని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తనపై వేధింపులలో భాగంగా ఏప్రిల్ 19న షాపులో ఉంచిన 18 లక్షల అమ్మకపు విలువగల సరుకును దొంగిలించారని ఆరోపించారు. దీనిపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఈ క్రమంలోనే ఈ నెల 9న సుమారు 15 లక్షల విలువైన సరుకులను మరొకసారి దొంగిలించారన్నారు. అంతేకాకుండా తనను షాపులో వ్యాపారం చేయనీకుండా బలవంతంగా బయటకు పంపేందుకు కుమార్ ప్రయత్నిస్తున్నాడని, అతని నుంచి తనకు ప్రాణహాని ఉందని, దీనిపై పోలీసులు వెంటనే విచారణ చేపట్టి, తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.



ఆందోళనకు దిగిన బాధిత మహిళ లీలా భారతి

గిరిజన చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :

ఆజాదీ కా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం గిరిజన సంక్షేమశాఖ, టిసిఆర్ అండ్ టిఎం ఆధ్వర్యంలో భూ బదలాయింపు, క్రమబద్ధీకరణ చట్టం, పీసా చట్టం, గ్రామసభ అధికారాలపై గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. టిసిఆర్ అండ్ టిఎం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ బి.మల్లికార్జున రెడ్డి అధ్యక్షత వహించారు. లీగల్ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ పల్లా త్రినాథరావు అధికారులకు ఏజెన్సీ ప్రాంత చట్టాలు, గవర్నర్ విధులు, అధికారాలు, భూ బదలాయింపు క్రమబద్ధీకరణ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీతంపేట, పాడేరు, పార్వతీపురం, రంపచోడవరం, కెఆర్.పురం, చింతూరు ఐటిడిఎల అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారులు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, టిసిఆర్ అండ్ టిఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ :

జివిఎంసి జోన్ - 5 పరిధి 55వ వార్డు తాటిచెట్లపాలెంలో గల అక్రమ నిర్మాణాన్ని కూల్చేయాలని ఆర్టీసీ విజిలెన్స్ విభాగం మాజీ అధికారి చిల్లా వెంకట స్వామి డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

రైతు దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఎంవిపి.కాలనీ :

ఈ నెల 14న ప్రపంచ రైతుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఉదయం ఉమెన్స్ కాలేజీలోని ఉద్యాన వనాల శాఖ ఇంటర్న్‌షిప్ విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై మాట్లాడారు.

పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-పద్మనాభం : రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రూపాలపకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు రూపాకుల రవికుమార్ కోరారు. మండలంలోని పాండ్రంగి గ్రామంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, నగర, గ్రామీణ పరిసరాల్లో భూకబ్జాలు జోరుగా సాగుతున్నాయని, వీటిపై అధికార యంత్రాంగం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు పక్క రాష్ట్రాలకు తరలివెళ్తున్నారని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత అన్ని పార్టీలపైనా ఉందన్నారు. ఎస్సీ కులాల వారి భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ అప్పారావు, మహంతి అప్పలనారాయణ, రెడ్డిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు కుంతీమాధవస్వామి చందనోత్సవం

ప్రజాశక్తి-పద్మనాభం : కుంతీమాధవస్వామి ప్రథమ చందనోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారు ప్రథమంగా చందన అలంకారంలో దర్శనం ఇవ్వనున్నారని, భక్తులు ఈ చందనోత్సవ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా స్వర్ణ పుష్పార్చన

ప్రజాశక్తి-సింహాచలం: అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చనను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా భాండాగారంలో భద్రపరిచిన స్వర్ణ పుష్పాలను వెండి పళ్లెంలో ఉంచి వేదమంత్రాలు నడుమ బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.

రహదారి భద్రతపై గీతం విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-మధురవాడ : రహదారి భద్రతపై యువతలో విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్ల ఆధ్వర్యాన గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ అమిత్‌భద్ర మాట్లాడుతూ రహదారి ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్న వారిలో యువత అధికంగా ఉంటున్నారని, దానికి కారణం మితిమీరిన వేగమేనని పేర్కొన్నారు. రహదారి నిబంధనలు పాటించడంతో పాటు హెల్మెట్ ధారణ, ప్రయాణంలో సెల్‌ఫోన్ దూరంగా ఉంచడం వంటివి ప్రమాదాలను నివారిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు గీతం సెక్యూరిటీ విభాగం సిబ్బంది, అధికారులు ర్యాలీలో పాల్గొని రహదారి భద్రతపై నినాదాలతో కూడిన బోర్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, సెక్యూరిటీ అధికారి రామాంజనేయులు, గీతం బిజినెస్ స్కూల్ విద్యార్థి ప్రతినిధులు శ్రీహిత్, శశి తదితరులు పాల్గొన్నారు.

అంతులేని విషాదం

తండ్రి మరణవార్త విని వెళుతుండగా ప్రమాదం
బైక్ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-నక్కపల్లి : తండ్రి మరణవార్త విని, కడసారి చూపుతోపాటు అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు తన కొడుకుతో కలిసి బైక్‌పై వెళుతున్న వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడిన ఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. నక్కపల్లి జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన విషాదంలో మరో విషాదానికి కారణమైంది. దీనికి సంబంధించి ఎస్ఐ శిరీష తెలిపిన వివరాలివి. తాడేపల్లిగూడేనికి చెందిన లోకనాథం ప్రతాపరాజు(49) కుటుంబంతో కలిసి వృత్తిరీత్యా లంకెలపాలెంలో నివాసం ఉంటున్నాడు. అతను తండ్రి బుధవారం మృతి చెందాడని సమాచారం రావడంతో, లంకెలపాలెం నుంచి తాడేపల్లిగూడేనికి గురువారం ఉదయం తన కొడుకు సుధీర్‌కుమార్‌తో కలిసి లోకనాథం ప్రతాపరాజు బైక్‌పై తాడేపల్లిగూడెం బయలుదేరారు. నక్కపల్లి వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో ప్రతాపరాజు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక సిహెచ్‌సికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుధీర్ కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

కార్మిక నేత గంగాధరరెడ్డికి నివాళి

ప్రజాశక్తి -తగరపువలస : ప్రముఖ కార్మిక నేత ఎస్.గంగాధరరెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు, పలువురు కార్మికులు గురువారం భీమిలి జోన్ పరిధి చిల్లపేట గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జంక్షన్‌లో ఉన్న కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికుల సమస్యలపై ఎన్నో పోరాటాలు నడిపారని, ఆయన నాయకత్వంలో కార్మికులు ఎన్నో హక్కులు సాధించుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నీలాపు శంకరరెడ్డి,



గంగాధరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జ్యూట్ కార్మికులు

కార్మిక సంఘం ప్రతినిధులు, జ్యూట్ కార్మికులు దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, ఎస్.ఈశ్వరరావు, జీరమణ, అప్పలరెడ్డి, టి.కూర్మారావు, బోర రామారావు, సిహెచ్.ఆదిరెడ్డి, నాగిరెడ్డి, తమ్మిన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ రన్నర్ మహతికి అభినందనలు



అభినందనలు అందుకుంటున్న విద్యార్థిని మహతి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో సిఎంఎస్ బ్రాంచ్ మొదటి ఏడాది విద్యార్థిని ఆర్.మహతి ఇటీవల తిరుపతిలో జరిగిన ఎపి సిఎం కప్ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రన్నర్‌గా నిలిచింది. ఈ మేరకు ఆమెను కళాశాలలో గురువారం పలువురు అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీరామకృష్ణ, సంబంధిత విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ తదితరులు ఆమెను అభినందించారు.

ఫైలేరియాపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు ఫైలేరియా వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించడం అభినందనీయమని 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ పేర్కొన్నారు. గురువారం వైద్యాధికారి ఎస్. ప్రశాంతి ఆధ్వర్యాన కార్పొరేటర్ ద్వారా ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఒక కిట్టు (సబ్బు, ప్లాస్టిక్ టబ్బు, టవల్, ఆయింట్‌మెంట్, మగ్గు) అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమతెరలు వాడాలని, అధికారుల సూచనలు సలహాలు పాటించాలని కోరారు. జిల్లా మలేరియా అధికారి వై.మణి మాట్లాడుతూ, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు రోజూ మంచినీటితో కాళ్లు కడగాలని, వేడి నీటిని వాడరాదని, కాళ్ళు పైనుంచి నెమ్మదిగా సబ్బు రాయాలని, చర్మం మడతలలోనూ కాలు వేళ్ళు మధ్య చిన్న



ఫైలేరియా రోగులకు కిట్లులను అందిస్తున్న కార్పొరేటర్ మంగమ్మ

గుడ్డ దూదితో నెమ్మదిగా శుభ్రం చేయాలని, కూర్చున్నప్పుడు మోకాళ్ళ కింద దిండు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎ.లక్ష్మి, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, సూపర్‌వైజర్స్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్‌ఒఎస్‌లో ఘనంగా మదర్స్ డే

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్ విలేజ్‌లో గురువారం మదర్స్ డే ఘనంగా నిర్వహించారు. చిల్డ్రన్ విలేజ్ డైరెక్టర్ కె.రవీంద్ర మాట్లాడుతూ, చిన్నారుల రక్షణ, సంరక్షణ తమ సంస్థ ముఖ్యోద్దేశమని చెప్పారు. ఈ సందర్భంగా తల్లుల సేవలకు గుర్తుగా వారిని సన్మానించారు. చిన్నారులు స్వయంగా తయారు చేసిన బొకేలు, గ్రీటింగ్ కార్డులు, బహుమతులను తల్లులకు అందజేశారు. వేడుకల్లో పాల్గొన్న తల్లులు, పిల్లలతో ఉన్న అనుబంధాన్ని అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ విలేజ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి

నేరాలు ఘోరాలు

గృహిణి దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక లంకా గ్రౌండ్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గృహిణి దుర్మరణం చెందారు. చోడవరం ప్రాంతానికి చెందిన కె.అమ్మాజీ (35) భర్తతో కలిసి పనిమీద శీలానగర్ వస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న వీరిని గాజువాక లంకా గ్రౌండ్ ఎదురుగా జాతీయ రహదారిలో లారీ ఢీకొట్టింది. దీంతో ఆమె కింద పడి దుర్మరణం చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : యువతి అదృశ్యంపై పెందుర్తి పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. దీనికి సంబంధించి పెందుర్తి సిఐ అప్పారావు కథనం ప్రకారం... నడుపూరు అప్పారావు కుటుంబంతో కలిసి పెందుర్తిలో నివాసముంటున్నారు. ఎమ్మెస్సీ చదివిన వీరి కుమార్తె శైలజ (23) గురువారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవడంతో తండ్రి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి -కోటవురట్ల: అక్కాహెబ్ పేట గ్రామానికి సంబంధించి కూర్మాసల నూకరాజు (73) అనే వ్యక్తి ఈనెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన బంధువులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. నూకరాజు తప్పిపోయిన సమయంలో తెల్లలుంగీ, తెల్ల షర్టు, మెడలో తువ్వాలుతో ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 04213 మొబైల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గాయపడిన బాలుడు మృతి

ప్రమాదస్థలిని పరిశీలించిన డిఎస్‌పి ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడు సుధీర్ లాజర్ మృతి చెందినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. నక్కపల్లి నుండి పెదపూడి కిరణ్ భార్య భారతి, పిల్లలు సుధీర్ లాజర్, ప్రతితో బైక్‌పై సారిపల్లివానిపాలెం వెళుతుండగా నక్కపల్లి జాతీయ రహదారిపై ఇసుక ర్యాంపు సమీపంలో ఆటోను వ్యాన్ ఢీకొట్టడంతో, ఆ ఆటో ముందున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారితోపాటు, బైక్‌పై ప్రయాణిస్తున్న పలువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో బైక్ ఉన్న కిరణ్ కుమారుడు సుధీర్ లాజర్ తీవ్రంగా గాయపడటంతో, విషమస్థితిలో ఉన్న బాలుడిని హుటాహుటిన విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో బుధవారం అర్ధరాత్రి బాలుడు సుధీర్ లాజర్ మృతి చెందినట్లు ఎస్ఐ శిరీష గురువారం వెల్లడించారు .

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : డిఎస్‌పి

రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డిఎస్‌పి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం నక్కపల్లిలోని రోడ్డు ప్రమాదస్థలిని ఎస్ఐ శిరీషతో కలిసి పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. రాంగ్‌రూట్‌లో వాహన రాకపోకలు సాగించకుండా అన్ని విధాల చర్యలు చేపట్టాలని ఎస్ఐ శిరీషకు ఆదేశించారు. వాహనాల వేగనియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు.

బైకిస్టుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని బోయపాడు గ్రామానికి చెందిన మరం చిన్న గురువారం బైక్‌పై బయలుదేరి వెళుతుండగా అమలాపురం సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నాను స్థానికులు స్థానిక సిహెచ్‌సికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచనల మేరకు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- చోడవరం

చోడవరం పంచాయతీ గ్రామానికి చెందిన పొట్నూరి హరి (39) అనే వ్యక్తి గురువారం రేవళ్ల వెళ్లే మార్గ మధ్యలో ఉన్న మామిడి తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హరి గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి ఆర్థికంగా నష్టపోవడంతో అప్పులు భారం అధికమై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. హరి మృతితో పెళ్లిడుకొచ్చిన ఇద్దరు ఆడపిల్లలు, కుటుంబం వీధిన పడినట్లు అయింది. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎన్‌ఎస్‌టిఎల్‌లో జాతీయ సాంకేతిక దినోత్సవం

ప్రజాశక్తి -కరాస: ఎన్‌ఎస్‌టిఎల్ మానసి ఆడిటోరియంలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎన్‌ఎస్‌టిఎల్ సంచాలకులు డాక్టర్ వై.శ్రీనివాసరావు, విశిష్ట అతిథిగా ప్రొఫెసర్ డివిఎల్‌ఎన్ సోమయాజులు, విశ్రాంత డైరెక్టర్ జనరల్ డాక్టర్ జివిఎన్.రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ ఎపిజె.అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డివిఎన్.సోమయాజులు మాట్లాడుతూ, అధునాతన వ్యవస్థల అభివృద్ధిలో గ్లోబల్ టెక్నాలజీ జోక్యాల ప్రాముఖ్యత అంశంపై విశ్లేషణ ప్రసంగం చేశారు. డిస్క్రిప్టివ్ అండ్ గ్లోబల్ టెక్నాలజీ, బిజినెస్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, డేటా సైన్స్, జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి వివిధ అంశాలను వివరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల నిరంతర కృషితో డిఆర్‌డిఒ అభివృద్ధి చేస్తున్న క్షిపణులు, టార్పెడోలలో దాదాపు 95 శాతం భాగాలు స్వదేశీ అని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యా సంస్థల సంయుక్త ప్రమేయంతో పరిశోధన, అభివృద్ధి రంగంలో భారతదేశం ప్రపంచంలో అగ్రగామి దేశంగా అవతరించగలదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పివిఎస్.గణేష్‌కుమార్, కృష్ణకుమార్, ఇతర శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్తలు


పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్


అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డు పరిధిలోని పార్కులలో చేస్తున్న అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం పరిశీలించారు. శాంతినగర్ పార్క్, కరాస పార్క్, కరాస హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశాన వాటికలలో జరుగుతున్న బ్యూటిఫికేషన్ పనులను కూడా శ్రీధర్ పరిశీలించారు. గ్రీనరీ, పెయింటింగ్ పనులు గురువారం ప్రారంభమైన నేపథ్యంలో లోపాలు లేకుండా చూడాలని సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి పార్కులను ప్రజలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.


వేసవి క్రీడా శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ వసంత

విద్యార్థులు క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-పెందుర్తి : విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత సూచించారు. ద్రోణంరాజునగర్‌లో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడుతూ, క్రీడలతో పేరు ప్రఖ్యాతలు సంపాదించవచ్చన్నారు. ఆటలకు అనుకూలంగా క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ రాష్ట్ర ప్రెసిడెంట్ నూకరాజు, హరినాథ్‌రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న నేత్ర వైద్య నిపుణులు

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి -మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు పరిధి నగరంపాలెం రోడ్డు వద్ద గల వెంకటేశ్వర విద్యాపీఠ్‌లో మేడే ఉత్సవాలలో భాగంగా గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. స్కూల్ చైర్మన్ వై.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. 200మందికి కంటి పరీక్షలు జరిపి అవసరమైన మందులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, పేదలకు వైద్యం అందుబాటులో లేదన్నారు. మురికివాడల్లో రోగాల పట్ల అవగాహన అవసరమన్నారు. రోటరీ క్లబ్, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. శస్త్రచికిత్సలు ఉచితంగా చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు, నాయకులు శ్రీనివాస్‌వర్మ, ఎన్‌జిఒ, ఐద్వా నాయకులు భారతి, రంగమ్మ, శంకర్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో రాష్ట్ర సమాచార కమిషనర్

ప్రజాశక్తి-సింహాచలం: ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను గురువారం రాష్ట్ర సమాచార కమిషనర్ కట్ట జనార్దనరావు దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ఎఇఒ వై.శ్రీనివాసరావు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

క్రీడలకు టిడిపి అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యేలు గంటా, గణబాబు


ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు గంటా, గణబాబు

ప్రజాశక్తి-మాధవధార : క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. కీర్తిశేషులు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు సందర్భంగా 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల వరప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని వారు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత క్రీడలలో ముందుండాలన్నారు. మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు ముందుకొచ్చిన వరప్రసాద్‌ను అభినందించారు. వరప్రసాద్ మాట్లాడుతూ, ఈ నెల 19వ తేదీ నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ఎన్‌టిఆర్ జయంతి అయిన మే 28వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు, టిడిపి నాయకులు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి -కంచరపాలెం : 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలలో ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఓల్డ్ ఐటిఐ ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఐటిఐలలో చేరే అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలలో చేరేందుకు ఒక్క దరఖాస్తు సరిపోతుందని తెలిపారు. అభ్యర్థుల వివరాల నమోదు అనంతరం విశాఖపట్నం జిల్లాలో గల సమీప అన్ని ప్రభుత్వ ఐటిఐలలో, ఓల్డ్ ఐటిఐ కంచరపాలెం, గవర్నమెంట్ ఐటిఐ (బాలికలు) ఇండస్ట్రియల్ ఎస్టేట్, గవర్నమెంట్ ఐటిఐ (న్యూ) గాజువాక, ప్రభుత్వ ఐటిఐ నరవ తదితర ఏదైనా ఐటిఐలలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని కౌన్సెలింగ్‌కు అర్హత పొందాలని పేర్కొన్నారు. వెరిఫికేషన్ చేయించుకోకుంటే వారి పేర్లు మెరిట్ జాబితాలో కనబడవని, వారి కౌన్సెలింగ్ అనుమతి ఉండదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డులకు సంబంధించిన అభ్యర్థులు ఎస్‌పి కేటగిరీలో మాత్రమే దరఖాస్తు చేసుకొని తర్వాత విధిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని వివరించారు.

చట్టరీత్యా దత్తత స్వీకరణ శ్రేయస్కరం

ప్రజాశక్తి -కంచరపాలెం : చట్టరీత్యా దత్తత తీసుకోవడం శ్రేయస్కరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పేర్కొన్నారు. ఆర్ అండ్ బి శ్రీరామ్‌నగర్ వద్దనున్న ప్రభుత్వ శిశుగృహంలో ఇద్దరు పిల్లల దత్తత ప్రక్రియ గురువారం చేపట్టారు. కర్ణాటకలోని బెంగుళూరు వైట్ ఫీల్డ్ ప్రాంతానికి చెందిన ఎం.వినోద్‌కుమార్ చంద్రమౌళి, దీప్తి దంపతులకు 8 నెలల బాలికను, రాష్ట్రంలోని ఒంగోలు తూర్పు కమ్మపాలెంనకు చెందిన టి.నాగరాజు, నాగమణి దంపతులకు 9 నెలల బాలుడిని చట్టప్రకారం అందజేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఐసిపిఎస్ డిసిపియు విభాగాలు ఈ ప్రక్రియను చేపట్టాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషన్ సభ్యులు సీతారాం ద్వారా పిల్లల్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆప్యాయంగా అనుబంధాలతో వారిని పెంచి దేశ ప్రయోజకులుగా తీర్చి దిద్దాలని దత్తత తీసుకున్న తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (సీడీపీఓ) రమణకుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, శిశు గృహ మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ ఎస్-ఎస్ రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

43వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు పరిధి అక్కయ్యపాలెం పోస్టాఫీసు వీధి ప్రాంతంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ పెడిశెట్టి ఉషశ్రీతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు.

ముందుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, చల్లా రజనీఈశ్వరరావు, కెవిఎన్.శశికళ, 48వ వార్డు ఇన్‌ఛార్జి నీలి రవి, డైరెక్టర్లు నూకరాజు, ప్రసాద్, కాయిత వెంకటలక్ష్మీరత్నాకర్, ఎయిర్ పోర్టు అడ్వయిజర్ కమిటీ మెంబర్ అంబటి శైలేష్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న కెకె.రాజు, ఉషశ్రీ

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలన


చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న బండారు

ప్రజాశక్తి-పెందుర్తి : టిడిపి అధినేత చంద్రబాబు ఈ నెల 17వ తేదీన విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పెందుర్తి టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, చంద్రబాబు సభ కృష్ణరాయపురంలోనా, సరిపల్లి, పెందుర్తి కూడలిలోనా అనే విషయాన్ని అనుమతి తీసుకున్న తర్వాత తెలియజేస్తామని చెప్పారు. చంద్రబాబు వస్తే సమస్యలు చెప్పుకోవడానికి చాలామంది ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టిడ్కో ఇళ్ల బాధితులతో ముఖాముఖి నిర్వహిస్తామని పేర్కొన్నారు. పంచ గ్రామాల సమస్యకు పరిష్కారం లభించలేదని తెలిపారు. టిడిపి హయంలో చిన్న చిన్న మరమ్మతులకైనా అవకాశం ఉండేదని, వైసిపి వచ్చిన తర్వాత పూర్తిగా పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండారు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతులకు బకాయిలు చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులకు వెంబనే బకాయిలు చెల్లించాలని, సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించాలని, కనీసం మద్దతు ధర టన్నుకు రూ.5000 ప్రకటించాలని కోరుతూ ఎపి చెరుకు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ వద్ద రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం సుగర్ ఫ్యాక్టరీ ఎండి వి.సన్యాసినాయులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చెరుకు రైతులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ చోడవరం సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 2022-23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి చెరుకు రైతులకు సుమారు రూ.72 కోట్ల బకాయిలు ఉండగా, వాటిని ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. రైతులు వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి చెరుకు పండించారని, ఫ్యాక్టరీ నిబంధన ప్రకారం చెరుకు తోలిన 14 రోజుల్లోగా పేమెంట్ చేయవలసి ఉన్నా ప్రభుత్వం నెలల తరబడి బకాయిలు చెల్లించడం పోవడానికి ఆయన తీవ్రంగా ఖండించారు. ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని, ఇతనాలు యూనిట్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ అమలుకు ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఫ్యాక్టరీని ఆధునికీకరించకపోవడం వలన క్రషింగ్ సామర్థ్యం తగ్గిపోయి ఇతర జిల్లాలకు చెరుకు తరలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రకటించిన రేటుకు అదనంగా పక్క రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రోత్సాహంగా టన్నుకు రూ.400 నుండి రూ.600 చెల్లిస్తున్నాయని, మన రాష్ట్ర ప్రభుత్వం కూడా కనీసం రూ.400 చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమనాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం కనీసం మద్దతు ధర రూ.5000 ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, సహాయ కార్యదర్శి ఎస్వీ నాయుడు, ఫ్యాక్టరీ కమిటీ కార్యదర్శి వి.సూర్యనారాయణ అధ్యక్షులు కంటమరెడ్డి నరసింహులు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు జరగడం అప్పారావు, పేర్ల రామప్ప నాయుడు, బోను దేవుళ్ళు తదితరులు పాల్గొన్నారు.



సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధి గుండాల వీధి సాయి నగర్‌లో ఎంపీ లాడ్స్ రూ.30 లక్షలతో చేపట్టిన డ్రైన్ నిర్మాణ పనులను గురువారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెయిన్ డ్రైన్ పూర్తయిందని, కాలనీలో ఉన్న చిన్న వీధి కాలువలను మెయిన్ డ్రైన్‌కు కలపాలని, సత్వరమే కాలవ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. శ్మశానానికి ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశామని, వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైసీపీ జిల్లా కార్యదర్శి ఆడారి సూరిబాబు, సచివాలయం కన్వీనర్ కోటేశ్వరరావు, ఎస్ఇ నాగేశ్వరరావు, జెఇ శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, వైసిపి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో భాగంగా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీ ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్ బి.పద్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్పత్తి పరిశ్రమలకు రూ.50 లక్షలు, సేవా రంగ పరిశ్రమలకు రూ.20 లక్షలు వివిధ బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కనీసం 8వ తరగతి చదివి, 18 ఏళ్లు నిండినవారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7396749236 లేదా 9441724353 నెంబర్లను సంప్రదించాలన్నారు.


మరిడిమాంబకు పీలా పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మారేడుపూడి గ్రామంలో శ్రీమరిడిమాంబ పండుగ గురువారం మాజీ శాసనసభ్యులు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ళ సురేంద్ర, మాజీ ఎంపీటీసీ రేబాక ప్రసాద్, అర్బన్ జిల్లా కార్యదర్శి పోలారపు త్రినాథ్, అక్కిరెడ్డి రమణబాబు, వరహాలు, బొండా నూకరాజు, కరణం కోటి, సత్తిబాబు, మారేడుపూడి గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగులాపల్లి పిఎసిఎస్ పరిశీలన

ప్రజాశక్తి-మునగపాక రూరల్

మండలంలోని నాగులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్)ను నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ మోహన్ అయ్య గురువారం సందర్శించారు. నాబార్డ్ నిధులు రూ.40 లక్షలతో తోటాడ గ్రామంలో సభ్యులు అవసరం నిమిత్తం నిర్మాణంలో ఉన్న గొడౌన్ పరిశీలించారు. అధిక మొత్తంలో డిపాజిట్‌ను సేకరించి సభ్యులకు అన్ని రకాలైన సేవలు అందిస్తూ సభ్యుల షేర్ ధనంపై ప్రతి సంవత్సరం 15శాతం డివిడెంట్ ఇస్తున్న సహకార సంఘ కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాసరావు, సూపర్వైజర్ శ్రీరామ్మూర్తి, సంఘం అధ్యక్షులు మల్ల ఉమామహేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు నరాలశెట్టి బాబురావు, కోయిలాడ ఎర్రయ్య నాయుడు, కార్యనిర్వహణాధికారి మళ్ల సోమచందర్ నాయుడు పాల్గొన్నారు.



పిఎసిఎస్ వద్ద నాబార్డు, డిసిసిబి అధికారులు, పాలకవర్గ సభ్యులు



గుర్రపు పందెం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ముత్యాలమ్మ తల్లి పండగ

రసవత్తరంగా ఎడ్ల, గుర్రపు పందేలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఎం.అలమండ గ్రామంలో ముత్యాలమ్మ తల్లి పండగ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జిల్లాస్థాయి గుర్రపు పందేలు నిర్వహించారు. 14 గుర్రాలు పోటీలో పాల్గొనగా, విజేతలకు మొదటి బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.8 వేలు, నాలుగో బహుమతి రూ.6 వేలు అందజేశారు. ఎడ్ల పరుగు పందేం పోటీల్లో 30 బళ్ళు పాల్గొనగా, విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, 5వ బహుమతి రూ.8 వేలు, 6వ బహుమతి రూ.6 వేలు, 7వ బహుమతి రూ.5వేలు, 8వ బహుమతి రూ.4వేలు అందజేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని మేళ తాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎఎస్.పేట పంచాయతీ కార్యదర్శిపై విచారణ

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని ఎఎస్.పేటలో ఇంటి పన్నుల విషయంపై పంచాయతీ కార్యదర్శి సత్యారావుపై స్పందనలో గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి శిరిషరాణి గురువారం గ్రామ సచివాలయంలో విచారణ చేశారు. ఈ ఏడాది ఇంటి పన్నులు ఎంత వసూలైంది? రావాల్సిన బకాయిలు ఎంత ఉన్నాయి? అడిగారురు. ఇక్కడ విచారణలో వ్యక్తమైన అభిప్రాయాలపై న్యాయ విచారణ జరుగుతుదని తెలిపారు. అనంతరం చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కొంకి అప్పారావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు



విచారణ చేస్తున్న డిపిఒ శిరీషరాణి

మండలంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని వివిధ గ్రామాల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఇటీవల ఎమ్మెల్యే అదీప్ రాజ్ వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి మండలంలో పర్యటించారు. గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జెఎన్ఎన్‌యుఆర్ఎం ఇళ్ల సముదాయం బసవతారకరామనగర్ కాలనీలో వున్న ఇండోర్ స్టేడియంను సందర్శించారు. బుష్, జంగల్ క్లియరెన్స్ చేసి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలని, బౌండరీలు ఫిక్స్ చేసి వెంటనే చర్యలు చెప్పట్టలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు, ఎంపీడీఓ హేమసుందరరావు, తహసీల్దార్ ప్రకాష్‌రావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పైల పైడంనాయుడు, వర్రి హరి, అధికారులు పాల్గొన్నారు.



బసవతారకరామ కాలనీ వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము



నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము విమర్శించారు. మండలంలోని జగ్గన్నపేట, కాజీపాలెం, పెదపాడు గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశాలను గురువారం ఆయన సందర్శించారు. అక్కడ కూలీలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు పెంచాల్సింది పోయి ఉన్న సౌకర్యాలు పోగొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని తెలిపారు. గతంలో ఉన్న వేసవి అలవెన్సు 30శాతం, పనిముట్లకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం రక్షణకై కూలీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గన్నపేట వైసిపి నాయకులు దొడ్డి కృష్ణ, చక్రవర్తి, కాళ్ల గోవిందరావు, జనపరెడ్డి లక్ష్మి, ద్వారపూడి సత్యవతి, గోవింద తదితరులు పాల్గొన్నారు.

13న ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్‌ల సదస్సు

ప్రజాశక్తి-పరవాడ

సర్పంచుల సమస్యల సాధనకై ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న శనివారం సర్పంచ్‌ల సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు చింతకాయల సుజాత ముత్యాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి గాంధీ మార్కెట్, కన్యకాపరమేశ్వరి దేవాలయం దగ్గర ఉన్న వైఎంవిఎ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జరుగు ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. జిల్లాలోని సర్పంచులు పడుతున్న ఇబ్బందులపైనా, రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల నిధులను విద్యుత్ బకాయిల పేరుతో మళ్లించడంపైనా, వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల పేరుతో సర్పంచుల అధికారాలు, విధులు, బాధ్యతలు హైజాక్ చేసి వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేయడంపైనా, వివిధ సమస్యలపైనా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సదస్సుకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని పార్టీలకు చెందిన సర్పంచ్‌లు హాజరై జయప్రదం చేయాలని కోరారు.



భువనేశ్వరరావును సత్కరిస్తున్న నాగజగదీష్ తదితరులు

భువనేశ్వరరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : టిఎన్‌టియుసి అనకాపల్లి పార్లమెంటరీ కార్యదర్శి బొబ్బ భువనేశ్వరరావు జన్మదిన వేడుకలు గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా భువనేశ్వరరావుకు నాగ జగదీష్ శాలువాతో సత్కరించారు. అనంతరం కేక్ కటింగ్ చేయించి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా నాగజగదీష్ మాట్లాడుతూ భువనేశ్వరరావు నిబద్ధత కలిగిన కార్యకర్త అని, 1985 నుండి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీ అప్పగించిన ప్రతి పనిని బాధ్యతగా నిర్వహించి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. వార్డు అధ్యక్షులుగా, నూకాంబిక అమ్మవారి దేవస్థానం డైరెక్టర్‌గా పదవులు అలంకరించారని, డీసీఎంఎస్ ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో కార్మిక నాయకుడిగా గుర్తింపు పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, సురే సతీష్, కుప్పిలి జగన్మోహన్, బోడి వెంకట్రావు, మల్ల గణేష్, విల్లూరి రమణబాబు, సాలాపు నాయుడు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన యాగంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కాయల మురళి, మాజీ ఎంపీపీ కూండ్రపు రాము నాయుడు, అక్కు నాయుడు, మాజీ సర్పంచ్ అక్కియమ్మ, ఎర్రి నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ చిరికి సన్యాసి నాయుడు, దుర్గా ప్రసాద్, చైతన్య, వెంకి నాయుడు, సూరిబాబు, ఈశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంటలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 27 మంది రోగులను ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారు. 15 మందికి కంటి అద్దాలు కోసం గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రొంగలి వెంకటరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు కంచర్ల నారాయణరావు, లీలావతి, వరిగాల శంకర్రావు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ, గొడుగుల పంపిణీ


ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో దిశ మహిళ పోలీస్ స్టేషన్ ఎదురుగా రాఘవేంద్ర మెడికల్ షాప్ వద్ద గురువారం మజ్జిగ, గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ దంత వైద్యులు శ్రీధరాల శ్యాం సుందర్, ప్రముఖ వ్యాపారవేత్త అరేపు కామేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా వాసవి క్లబ్ అనకాపల్లి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. వాసవి క్లబ్ పంపిణీ చేసిన గొడుగులు ఎండలో రోడ్డుమీద వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ తాటికొండ శ్రీనివాసరావు, సెక్రటరీ బొగ్గారపు మంగరాజు, ట్రెజరర్ నాగరాజు, కడిమిశెట్టి రాము, క్లబ్ మెంబర్స్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



గొడుగులు పంపిణీ చేస్తున్న దృశ్యం





అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పశువుల పాక, గడ్డివామి, బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి

పశువుల పాక, గడ్డివామి దగ్ధం

రెండు పశువులు మృత్యువాత

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని శంభువానిపాలెం గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కొల్లి సన్యాసినాయుడుకు చెందిన పశువుల పాక, గడ్డివామి దగ్ధమయ్యాయి. రైతు గమనించి బోరు ద్వారా పక్కనే ఉన్న ధాన్యం పురిని కాపాడుకోగలిగాడు. ఈ ప్రమాదంలో పాకలో ఉన్న రెండు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుసుకొని పశు వైద్యాధికారి అలేఖ్య, అప్పారావు వచ్చి కాలిపోయిన పశువులకు వైద్యం అందించారు. అయినా రెండు పశువులు మృతి చెందాయి. ఎస్సై డి.నాగేంద్ర, మహిళ పోలీస్ వరలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఆర్థిక సాయం

ప్రమాద విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు సంఘటనా స్థలాన్ని సందర్శించి, బాధిత రైతును పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు రూ.4 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం కనీసం రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. రామానాయుడు వెంట టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పెంటకోట అప్పలనాయుడు ఉన్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు నష్టపోయిన రైతు కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వైసిపికి ఆదరణ తగ్గలేదు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి-కె.కోటపాడు

వైసిపికి ప్రజల్లో ఆదరణ చెక్కు చెదరలేదని ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన ఇకముందు కూడా కొనసాగుతుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో మేజర్ పంచాయతీ చౌడువాడ ఎస్‌సి కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. అన్ని శాఖల అధికారులను వెంటబెట్టుకుని ఉదయం 8 గంటల నుండి గతంలో మిగిలి ఉన్న 360 గృహాలకు వెళ్లి వాళ్ల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాలతో ఆగిన పథకాలను అక్కడికక్కడే అధికారులు దగ్గరుండి లబ్ధి పొందే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎస్సీ కాలనీలో వాసుల అభ్యర్థన మేరకు కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేశారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమానికి రూ.4.68 కోట్లు మంజూరు చేశారు. జగనన్న కాలనీలో మరో 58 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు అనుసంధానం చేస్తూ తారు రోడ్ల సదుపాయం కల్పించచమని, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి వేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, రమేష్ బాబు, ఎంపీడీవో, శశీదేవి, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, ఎంపీటీసీలు, సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి

ల్యాండ్ పూలింగ్ బాధితులకు న్యాయం చేయాలని

15న ఆర్‌డిఓ కార్యాలయం వద్ద నిరసన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలంలో ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 15న ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు అనకాపల్లి అఖిలపక్ష పార్టీల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణ పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం జిఒ 72 తీసుకొచ్చి ల్యాండ్ పూలింగ్ ద్వారా సుమారు 1100 ఎకరాల డి.ఫారం భూములను పేదల నుండి లాక్కుందని తెలిపారు. ఈ భూములకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఇవ్వకుండా దొంగనాటకాలు ఆడుతుందని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గతంలో స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో నిరసన దీక్షలు చేశామని, అయినా ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు స్పందించటం లేదని విమర్శించారు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా 15న ఆర్‌డిఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఐఆర్.గంగాధర్, దాసరి సంతోష్, టి.సంతోష్, సిపిఐ నాయకులు వైఎన్.భద్రం, సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథబాబు తదితరులు పాల్గొన్నారు.

'దళిత ద్రోహి జగన్ రెడ్డి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ ముద్రించిన దళిత ద్రోహి జగన్ రెడ్డి అనే పుస్తకాన్ని స్థానిక టిడిపి పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 27 దళిత పథకాలను జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రద్దు చేసి దళిత ద్రోహిగా మిగిలిపోయారని విమర్శించారు. అంతే కాక రూ.33 వేల కోట్లు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వేల ఎకరాల దళితుల అసైన్డ్ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని, 50 వేల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని పేర్కొన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను రద్దు చేశారన్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్ మాట్లాడుతూ కోడికత్తి డ్రామాలో దళిత బిడ్డ శ్రీనివాస్, ఆయేషా మీరా కేసులో దళిత బిడ్డ సత్యంబాబును ఏళ్ల తరబడి జైలుపాలు చేశారని విమర్శించారు. దళితుడైన తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ మరణించగా ముఖ్యమంత్రి కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లకపోగా తిరుపతి ఎంపీ టికెట్ కూడా ఆ కుటుంబానికి ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు యలక మల్లిబాబు, నాయకులు మైలపల్లి పోతురాజు, తోటాడ విజయ్ కుమార్, సిహెచ్ సోమరాజు, బెల్లాన శ్రీనివాసరావు, సిమ్మిటి రామకృష్ణ, నేతల రాము, బోని గణేష్, నంబారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న వైసిపి నాయకుడు దాడి రత్నాకర్

పసిడి కలశ ప్రతిష్ఠ మహోత్సవం

ప్రజాశక్తి - కసింకోట : మండలం కన్నూరు పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి, కామాక్షి సమేత ఏకాంబరేశ్వర, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర, సింహవాహనం, నందీశ్వర, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీమాతా గోవిందమాంబ, సిద్ధయోగి, ధ్వజస్తంభ, పసిడి కలశ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి పార్లమెంటు పరిశీలకులు దాడి రత్నాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్‌కు ఆలయ నిర్వాహకులు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వెదురువాడ సన్యాసి ఆచారి, మత్తుర్తి గంగారావు, కోటిపల్లి జెజిబాబు, వేగి దొరబాబు, లోవ అప్పారావు, కొమ్మోజు ప్రసాద్, శ్రీశైలపు ఈశ్వరరావు, చేబ్రోలు సూరిబాబు పాల్గొన్నారు

ఎంఆర్‌పిఎస్ కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి- సబ్బవరం : మాదిక రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు తెలిపారు. మండలంలోని ఆరిపాక పంచాయితీ శివారు వినయాతపాలెంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత మరేడుపూడి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత నెలలో తిరుపతిలో జరిగిన జాతీయ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం గో టు విలేజస్ విజన్ 50 కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోనూ నిర్వహించాలని చెప్పారు. దీనికి అనుగుణంగా మండల స్థాయి, గ్రామ స్థాయి కమిటీలు నియమిస్తున్నట్లు తెలిపారు. సంఘం పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్‌గా ఇండుగుబిల్లి గోపి, సబ్బవరం మండల కన్వీనర్‌గా బొర్రా జయరాజు, కో-కన్వీనర్‌గా నీటిపల్లి కిరణ్, మాదిగ యువసేన కన్వీనర్‌గా మరేడుపూడి శివాజీ, కో-కన్వీనర్ జోరీగల నరసింహ మూర్తిని నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గోటివాడ స్మార్ట్ కుమార్, నాయకులు కొల్లి చినఅప్పారావు, యలక మల్లిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

143 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

45,242 భూహక్కు పత్రాల అందజేత

పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు

రెండో దశలో 150 గ్రామాలు

సుజల స్రవంతి భూ సేకరణ వేగవంతం

అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి



జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా 143 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. 733 రెవెన్యూ గ్రామాల్లో జివిఎంసి, ఎపిఐఐసి, ఫార్మాసిటీ పరిధిలోని 45 గ్రామాలు పోనూ, మిగిలిన 688 గ్రామాల్లో తొలి దశ కింద 143 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిం దన్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రెండోదశ రీ సర్వే జరుగుతోం దన్నారు. తొలిదశలోని 143 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన 96,695 ఎకరాలకు 69,803 వ్యక్తిగత ఖాతాలు, 2,36,040 భూ భాగపు సంఖ్యగా రికార్డు చేసినట్లు తెలిపారు. వీటిలో 127 గ్రామాల్లోని రైతులకు 45,242 జగనన్న భూ హక్కు పత్రాలు అందజేశామన్నారు. మరో ఆరువేల వరకు భూ హక్కు పత్రాలు వ్యక్తిగత ఖాతాదారులకు ఇవ్వాల్సివుందన్నారు. కొద్ది రోజుల్లో హద్దులకు సంబంధించి రాళ్లుపాతే ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. కలెక్టరేట్‌లో నైపుణ్యం కలిగిన 25 మంది సర్వేయర్లు రీ సర్వేలో వచ్చిన ఫిర్యాదులను వివిధ స్థాయిల్లో పరిశీలించి సరిచేస్తున్నారని తెలిపారు. తొలి దశ రీ సర్వేలో వచ్చిన పొరపాట్లు రెండో దశలో జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నా మన్నారు. రెండోదశలో 220 గ్రామాల్లోని 2,07,052 ఎకరాల్లో రీ సర్వేను మూడు నెలల్లోపు పూర్తిచేస్తా మన్నారు. 30 గ్రామాల్లోని 19,659 ఎకరాల్లో రీ సర్వే పూర్తిచేసి, ఫైనల్ ఆర్ఒఆర్ ప్రచురించినట్లు తెలిపారు. మిగిలిన 190 గ్రామాల్లో రీ సర్వే వేగంగా జరుగుతోం దన్నారు. మే చివరకు 150 గ్రామాల్లో రీ సర్వే పూరి్తచేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్మాన్నారు. జిల్లాలో ఇంతవరకు షటిల్‌మెంట్ కాని భూములను రీ సర్వే చేస్తామన్నారు. 22ఎ భూములకు సంబంధించి తమ దృష్టికి వచ్చిన అర్జీలను వారం రోజుల్లో పూర్తిచేస్తా మన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు.

వైసిపి నేతల దాడిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో సిహెచ్.నాగాపురం పంచాయతీలో వైసిపి, టిడిపి నాయకులు మధ్య వివాదం రేగింది. పరస్పర దాడులు చేసుకున్నారు. దీనిపై కేడిపేట పోలీసుస్టేషన్‌లో టిడిపి వర్గీయుడు బొప్పన ప్రసాద్ పిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం గ్రామంలో మోపెడ్ పార్కింగ్ విషయంలో రెండు వర్గీయులకు గొడవ జరిగింది. గొడవను సద్దుమణిచే ఉద్దేశంలో, రెండు పార్టీల పెద్దలు మాట్లాడుతున్న సమయంలో వైసిపికి చెందిన సర్పంచ్ రఘురామచంద్రరావు, ఎర్రా నాగేశ్వరరావు, ఎర్ర శ్రీనివాసరావు పెద్ద మనిషిగా వచ్చిన టిడిపి వర్గానికి చెందిన బొప్పన ప్రసాదుపై దాడి చేశారు. దీనిపై వైసిపి పెద్దలుగా వచ్చిన వారు మద్యం మత్తులో తనపై దాడి చేశారని, ఆ సమయంలో తనకు ప్రాణహాని తలపెట్టే పరిస్థితులు నెలకొనడంతో గ్రామస్తులు తనని దాచివేసారన్నారు. తనపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రసాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు ఫిర్యాదు తీసుకున్న పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని 33 /11 కెవి విద్యుత్ లైన్ నిర్వహణ, మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ కారణంగా ఈనెల 12న ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఆపరేషన్స్ మండల ఇన్‌ఛార్జి ఇంజినీరు చంద్రమౌళి తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

జాబుకార్డుదారులందరికీ ఉపాధి పని కల్పించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : జాబుకార్డులున్న వారందరికీ ఉపాధి పని కల్పించాలని ఎంపిడిఒ సీతారామరాజు ఉపాధి సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని సిహెచ్ లక్ష్మీపురంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. నిర్ణీత కొలతలు మేరకు పనిచేయాల న్నారు. ప్రతిరోజూ కనీస వేతనం రూ.272 వచ్చేలా పనిచేయాలన్నారు. గ్రామాల్లో ఎస్‌సి కూలీలు తప్పని సరిగా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని ఉపాధి సిబ్బందికి సూచించారు .

కరెంటు తీసేస్తే కార్యాలయంలోనే పడక!

అప్రకటిత విద్యుత్ కోతపై సిపిఎం నేతల హెచ్చరిక



మాట్లాడుతున్న సిపిఎం నేత గోవిందరావు

ప్రజాశక్తి-రోలుగుంట : మండువేసవిలో ఉక్కబోత సమయంలో అర్ధరాత్రి కరెంటు కోత విధిస్తే, ప్రజలందరితో కార్యాలయానికి మంచాలతో వచ్చి పడుకుంటామని సిపిఎం జిల్లా కమిటీ నాయకులు కె.గోవిందరావు హెచ్చరించారు. గురువారం మాట్లాడుతూ ఓపక్క మండువేసవి, ఎండలు మండుతూ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న తరుణంలో ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి ఆవుతున్నారని, ఇటువంటి తరుణంలో అర్ధరాత్రి కరెంటు కోతలు విధించడం కరెక్ట్ కాదన్నారు. బుధవారం రాత్రి విధించిన అప్రకటిత కరెంటు కోతకు రోలుగుంట ప్రజలు నరకం చూసారన్నారు. ముఖ్యంగా రోలుగుంట మండల కేంద్రంలో వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు పడిన అవస్థలు వర్ణనాతీతమన్నారు. ఒకవైపు ఒక్కపోత, మరో వైపు దోమలు మోత తట్టుకోలేక జాగారాలు చేసే పరిస్థితిలో ఉన్నారన్నారు బుధవారం రాత్రి లాగేకరెంటు కోతలు పునరావృతం అయితే కార్యాలయానికి మంచాలు తెచ్చి పడుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి కరెంట్ కోతలు లేకుండా చూడాలన్నారు.

బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురళి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం ,అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సీపట్నం పెద్ద బొడ్డేపల్లికి చెందిన పులిగా రామ్మోహన మురళి నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు నియామక పత్రాన్ని అందజేశారని తెలిపారు.
ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి ఇటువంటి గురుతర బాధ్యత అప్పగించిన బిసి సంక్షేమ సంఘం ఛైర్మన్ పావులూరి హనుమంతరావు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేష్‌లకు, సంఘం కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ, సంఘం బలోపేతానికి, అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి దిమిలి రాజేష్ మాట్లాడుతూ, పలు పదవులు చేపట్టిన అనుభవమున్న మురళీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులు కావడం ఆనందదాయకమన్నారు. ఆయన సూచనలు, సలహాలతో బిసి సంఘాన్ని మరింత ముందుకు నడిపిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమింపబడిన మురళిని పలువురు అభినందించారు.

ఐటి ప్రగతిలో నాస్కామ్ కీలక పాత్ర

ప్రజాశక్తి-మధురవాడ : గడిచిన 30 ఏళ్లలో దేశంలోని ఐటి రంగాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రగతి పథంలో నడిపించడంలో నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్) కీలక పాత్ర పోషించిందని, ప్రభుత్వానికి, ఐటి రంగానికి మధ్య విధాన నిర్ణయాలు తీసుకోవడంలో వారధిగా నిలిచిందని నాస్కామ్ సహ వ్యవస్థాపకుడు హరీష్ మెహతా అన్నారు. నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మాట్లాడుతూ, ఐటి రంగం ప్రగతిని ముందుగానే ఊహించిన ఘనత అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దేశంలోని 20 రాష్ట్రాలకు ఐటి డ్రాఫ్ట్ పాలసీలను నాస్కామ్ రూపొందించిందని, ఐటి రంగం ప్రయోజనాలపై దశాబ్దాల కిందటే ప్రభుత్వాలకు నాస్కామ్ వివరించిందని తెలిపారు. నాస్కామ్ తరహాలో చైనా సహ ఇతర దేశాలు ప్రత్యేక వ్యవస్థలను రూపొందించుకునే ప్రయత్నం చేసినా అంతగా విజయం సాధించలేదన్నారు. నేటికీ భారతదేశం ప్రపంచం దృష్టిలో ప్రతిభ గల మానవ వనరుల కేంద్రంగా తన ముద్రను కొనసాగిస్తోందని తెలిపారు. ఇతర దేశాల ఆర్థిక సంక్షోభ ప్రభావం భారత ఐటి రంగంపై పెద్దగా ఉండబోదని, కృత్రిమ మేధ వంటి నూతన టెక్నాలజీలపై దేశ మానవ వనరులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. దేశంలో స్టార్టప్ సంస్కృతి పెరుగుతోందని, ఇది మరింతగా వృద్ధి చెందాలంటే స్వయం నియంత్రణ వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని, దీనిపై ఇప్పటికే నాస్కామ్ కార్పొరేట్ గవర్నెన్స్ నిబంధనలను రూపొందించిందని వెల్లడించారు. ఛాట్ జిపిటి వంటివి భారత దేశంలో విప్లవాత్మక మార్పులకు దారితీయగలవని అన్నారు. అనంతరం హరీష్ మెహతాను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సన్మానించారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, రిసెర్చి విభాగం డైరక్టర్ డాక్టర్ రాజాఫణిపప్పు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



నక్కపల్లిలో పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



నర్సీపట్నంలో పుస్తక పఠనంలో నిమగ్నమైన చిన్నారులు

ప్రజాశక్తి- నక్కపల్లి : చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లైబ్రేరియన్ జనార్ధన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా హరీష్ వ్యవహరించారు. గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, జోగేశ్వరరావు, సిబ్బంది రవణమ్మ పాల్గొన్నారు .

గొలుగొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, నీతికథలు దేశభక్తి గీతాలు పోటీలు నిర్వహించారు. 35 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.రిసోర్స్ పర్సన్‌గా రామకృష్ణ మాస్టారు వ్యవహరించారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ వెంకటరమణ పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పుస్తకపఠనంపై తెలుగు ఉపాధ్యాయురాలు విజయకుమారి వివరించి, పద్యాలు చదివించారు. డ్రాయింగ్ టీచర్ రవికుమార్ బొమ్మలు వేయడం, వాటికి రంగులు దిద్దడం నేర్పించారు. విద్యార్థులతో కథల పుస్తకాలను చదివించారు. గ్రంథాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో పిల్లలకు ఒఆర్ఎస్ ద్రావణాన్ని అందజేశారు.

మునగపాక రూరల్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థుల చేత నీతి కథలు చదివించారు. రిసోర్స్ పర్సన్ పిల్ల జగదీష్ గణితంలో పలు మెలకువలు నేర్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో గణిత శాస్త్రంపై సులభంగా పట్టు సాధించేందుకు ఈ బోధన దోహదపడుతుందని ఆయన తెలిపారు. గ్రంథాలయ అధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల శివకోటి దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వి.శిరీష మాట్లాడుతూ పుస్తక పఠనం వలన విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

కొంతలంలో నీటి ఎద్దడిపై 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని కొంతలం గ్రామం ఎస్‌టి కాలనీలో మూడు నెలల నుంచి మంచినీరు రాక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జగనన్న చెబుదాం స్పందన కార్యక్రమంలో జనసేన నాయకులు కేసరిపూడి శివాజీ ఫిర్యాదు చేశాడు. దీనిపై గ్రామ కార్యదర్శి స్పందించి పది రోజుల్లో సమస్యను పరిష్కరించి, తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సోమిరెడ్డి బాబ్జి పాల్గొన్నారు

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం

ప్రజాశక్తి-రోలుగుంట : మోడీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమానికి ప్రజాతంత్ర శక్తుల సమీకరణ చేస్తున్నామని అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్.అజయ్‌కుమార్ అన్నారు. గురువారం రోలుగుంట మండలం పెద్దపేట గ్రామం చటర్జీపురం వద్ద ఆదివాసీలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఓట్ల కోసం, రాజకీయ అధికారం కోసం సమాజంలో మోడీ బిజెపి మత వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. కర్ణాటక ఎన్నికలలో ఆంజనేయుడిని ఒక అంశంగా మార్చి రాజకీయాలకు మత రంగు పులిమారని, అయినా ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.10 లక్షల కోట్లు పన్ను మినహాయింపులు, బ్యాంకు రుణాల మినహాయింపులు ఇచ్చిన మోడీ ప్రభుత్వం , గ్రామీణ పేదలకు వంద రోజులు పని కల్పించే ఉపాధి హామీ పథకానికి కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. దేశ గ్రామీణ కార్మికులకు 15 రోజులకు మించి పని కల్పించడానికి ఈ నిధులు సరిపోవన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమైన మూడు ప్రాంతీయ పార్టీలున్నా అందరూ మోడీ సర్కార్‌కు మోకరిల్లడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 25న అనకాపల్లిలో నిర్వహిస్తున్న అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ విభాగం 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రావికమతం మండల కన్వీనర్ మోసూరు రాజు, కేదారి దేవి, వొంపురి రాజబాబు, మార నూకరాజు పాల్గొన్నారు

ఆరిలోవలో అపోలో కేన్సర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి గురువారం సాయంత్రం విశాఖ ఆరిలోవలో అపోలో కేన్సర్ సెంటర్ (ఎసిసి)ను ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ తన ప్రాంగణంలో 54 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునికమైన ఈ కేన్సర్ కేంద్రాన్ని నిర్మించింది. ఇది ట్రూ బీమ్ ఎస్‌టిఎక్స్ టెక్నాలజీ కలిగిన ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటి కేన్సర్ కేంద్రం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని, డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఎమ్‌వివి.సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్. విశ్వనాథన్, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, నెట్ క్యాప్ చైర్మన్ కెకె.రాజు, అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


అపోలో కేన్సర్ సెంటర్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి


ఆసుపత్రిలోని ఆధునిక వైద్యపరికరాలను పరిశీలిస్తున్న సిఎం జగన్

దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి


అనుకు గ్రామం సందర్శనలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీడీ

ప్రజాశక్తి-కోటవురట్ల: దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ డిప్యూటీ డైరెక్టర్ రామిరెడ్డి అన్నారు. గురువారం గొట్టువాడ శివారు అనుకు గ్రామాన్నివైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. పలు వ్యాధులకు కారణమైన దోమల నియంత్రణ పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా మారుమూల గ్రామాల్లో దోమల నివారణ మందులు పిచికారీ నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. గ్రామంలో దోమలనివారిణి పిచికారీ పనులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మలేరియా నియంత్రణ అధికారి వరహాలు, స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు

ఈదురుగాలులతో భారీ వర్షం


వర్షపు నీటితో నిండిపోయిన రోడ్డు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో పలు చోట్ల గురువారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి ఎండ విపరీతంగా కాసినప్పటికీ, సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి, ఆకాశం మేఘావృతమే ఈదురుగాలతో కూడిన వర్షం పడింది. ఏఎల్‌పురం, కొంగసింగి, సిహెచ్.నాగాపురం, పాతకృష్ణదేవిపేట, లింగంపేట తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. కాలువలు సరిగా లేకపోవడంతో ఏఎల్‌పురంలో వర్షానికి మురుగుతో పాటు వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. ముఖ్యంగా కేడిపేట ఆర్‌టిసి బస్‌స్టాండ్ ఆవరణ వర్షపు నీటితో చెరువును తలపించింది.

సంపద తయారీ కేంద్రం పరిశీలన


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపిడిఒ సీతారామరాజు, ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ గురువారం పరిశీలించారు. కేంద్ర నిర్వహణ పక్కాగా అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు సూచించారు. ముఖ్యంగా గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని, తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చెత్త నుంచి వర్మీకంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీకి ఇక్కడకు వచ్చే పంచాయతీ ప్రతినిధులకు సరైన శిక్షణ ఇవ్వాలని సూచించారు.

త్వరితగతిన భూహక్కు పత్రాల పంపిణీ


రీసర్వేపై సమీక్షలో సూచనలుచేస్తున్న ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-కోటవురట్ల: సమగ్ర భూరీసర్వే పూర్తయిన వెంటనే సంబంధిత రైతులకు త్వరితగతిన భూహక్కు పత్రాలు అందజేయాలని నర్సీపట్నం ఆర్‌డిఒ వెంకట జయరాం ఆదేశించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలో చేపడుతున్న రీసర్వేపై రెవెనూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో ఇంతవరకు సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి భూహక్కు పత్రాలు అందజేయాలన్నారు. భూహక్కుపత్రాలలో చిన్న తప్పులు ఉంటే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. సర్వే నిర్వహిస్తున్న గ్రామాలలో సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించి, ఎటువంటి వివాదాలు తప్పులు దొర్లకుండా సర్వే నిర్వహించాలని సున్నితంగా హెచ్చరించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా 96 వేల ఎకరాలకు సర్వే నిర్వహిస్తున్నామని, 140 గ్రామాలలో సర్వే నిర్వహించగా 50 గ్రామాలలో సర్వే పూర్తిచేసుకుని వారికి భూహక్కు పత్రాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు, కార్యక్రమంలో తహశీల్దార్ జానకమ్మ, డిప్యూటీ తహశీల్దారు సోమశేఖర్, మండల సర్వేయర్ వరప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.


ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

ఐదో షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యాన నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి-మాడుగుల : ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఐదవ షెడ్యూల్ సాధన కమిటి జిల్లా ప్రధానకార్యదర్శి నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నేత భవానీ డిమాండ్ చేశారు. ఉపాధి పథకానికి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కోత, పథకం అమలులో నిర్లక్ష్యం వల్ల కూలీలకు జరుగుతున్న నష్టం, ఇతర సమస్యలపై గురువారం జెడి పేటలో ఉపాధి పని ప్రదేశం వద్ద కూలీలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్‌కార్డుదారులకు పనికల్పన, గిట్టుబాటైన కూలీ, ఇంకా చట్టంలోని ఏ ఇతర నిబంధనలూ అమలు కావడం లేదని, దీంతో కూలీలకు ఉపాధి దొరకని పరిస్థితి ఉందన్నారు. మరోవైపు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేదలు, సామాన్యుల జీవనం దుర్భరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో కూలీలు పెద్దఎత్తున పాల్గొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -కోటవురట్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కొండబాబు ప్రత్యేక శ్రద్ధతో తరగతుల నిర్వహణపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశాలతో ఇటీవల ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 21 వరకు అన్ని సబ్జెక్టులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కొండబాబు తెలిపారు.

గడువులోగా

'నాడు - నేడు' పనుల పూర్తి

నాణ్యతలో రాజీ వద్దు : ఆర్‌అండ్‌బి ఇఇ


పిహెచ్‌సిల పనులను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బి ఇఇ రమేష్

ప్రజాశక్తి-గొలుగొండ : రెండో విడత నాడు నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్‌అండ్‌బి ఇఇ సిహెచ్.రమేష్ సూచించారు.. గురువారం మండలంలోకి కృష్ణదేవిపేట, గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రూ.1.50 కోట్ల నిధులతో జరుగుతున్న భవనాలు, మరుగుదొడ్లు, సీలింగ్, ప్రహరీ తదితర మరమ్మత్తు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా నాడునేడు పనులను నాణ్యతతో చేపట్టడంతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తయ్యేలా చూడాలన్నారు. పనుల నిర్వహణపై డిఇఇ, జెఇఇలు నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నాణ్యత, సమయపాలనలో రాజీ లేకుండా పనులు పూర్తిచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి నర్సీపట్నం డిఇఇ కెఎస్.సిద్దార్థ ప్రభు, జెఇఇ ప్రసాద్, నర్సీపట్నం ఎఎంసి చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, వైద్యాధికారులు డాక్టర్ హరిప్రవీణ్, డాక్టర్ శైలజ, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

కుళాయి ఏర్పాటు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల భవనంలో తాగునీటి కుళాయిని ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచినీటి కుళాయి ఏర్పాటును అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవి.సుబ్బారావు, కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ కుమార్‌బాబు పాల్గొన్నారు.


కుళాయిని ప్రారంభిస్తున్న సన్యాసిపాత్రుడు